క్లుప్తంగా

బోనస్ ఇవ్వాలని ధర్నా



పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

పుల్‌కల్(అందోల్): మండలంలోని సూరెడ్డి ఇటిక్యాల గ్రామంలోని ఎంఎస్ పరిశ్రమలో బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కార్మికులు బుధవారం గేట్ ఎదుట ధర్నా చేశారు. మూడు సంవత్సరాల నుంచి బోనస్ ఇవ్వడం లేదని కార్మికులు వాపోయారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళా కార్మికులు ధర్నా నిర్వహించారు.

అందరికీ సంక్షేమ పథకాలు



చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

మునిపల్లి(అందోల్): పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని మాజీ ఎంపీపీ రాంరెడ్డి, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ సమావేశ మందిరంలో తహసీల్దార్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 182 మందికి అందజేశారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ సహకారంతో మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ ఎంపీటీసీ పాండు, సర్పంచ్ అంజిరెడ్డి, రసూల్ పటేల్, దర్జి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో పీసీబీ సభ్యుల తనిఖీ

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలో రసాయన జలాలను సేవించి 15 పశువులు మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ వ్యవహారంపై గ్రామస్తులు గతంలో రాష్ట్ర పీసీబీ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అధికారులు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. బుధవారం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని అయ్యమ్మ చెరువుపై భాగంలో ఉన్న పలు రసాయన పరిశ్రమలను వారు తనిఖీ చేశారు. వ్యర్థాలను పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. బాధ్యులైన పరిశ్రమలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పీసీబీ అధికారులను కోరారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



టీచర్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ

మునిపల్లి(అందోల్): మండలంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు మాధురిమకు గంధం సరస్వతీ మెమోరియల్ ట్రస్టు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర భాష సాంస్కృతిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా మధురిమ ఎంపికైన సందర్భంగా ఉపాధ్యాయులు, ఎంఈఓ బీమ్‌సింగ్ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు మాధవి, ప్రధానోపాధ్యాయులు అశోక్ కుమార్, ఉపాధ్యాయులు చంద్రమౌళి, కల్పన, కవిత, అరుణ, బుష్రా విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. బుధవారం మయూరినగర్ కాలనీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో త్వరలో సీసీ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించామని చెప్పారు. కార్యక్రమంలో కాలనీవాసులు మహిపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, విఠల్ రెడ్డి, రాజుగౌడ్, దేవేందర్ యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

నిరసనకారులపై దాడి సరికాదు

కంగ్టి(నారాయణఖేడ్): సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ధ్వంసంపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేసి గాయపర్చడాన్ని వ్యతిరేకిస్తూ స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బంద్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ విజయ్‌కుమార్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. తడ్కల్‌లోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం వద్ద సమితి సభ్యులు పోలీసుల లాఠీచార్జ్‌ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో తడ్కల్, హిందూ సంఘాలు పాల్గొన్నారు.

తారురోడ్లపై 'మట్టి పూతలు'

- గుంతలను మట్టితో పూడ్చిన వైనం
- ఆ రోడ్లపై ప్రయాణం నరకం
- సింగూరు ప్రాజెక్టుకు తగ్గిన పర్యాటకులు



పుల్‌కల్ మండలం మిన్‌పూర్ వద్ద మట్టితో పూడ్చిన తారురోడ్డు

పుల్‌కల్(అందోల్): నియోజకవర్గంలోని పుల్‌కల్ మండలంలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. తాడ్‌దాన్‌పల్లి -సింగూరు 17 కిలోమీటర్ల రోడ్డు, పోచారం-సంగుపేట 17 కిలోమీటర్లు, సింగూరు ప్రాజెక్టు -ఆత్మకూర్ 10 కిలోమీటర్లు, సింగూరు ప్రాజెక్టు-మునిపల్లి 10 కిలోమీటర్లు, పుల్‌కల్-వట్‌పల్లి 30 కిలోమీటర్లు పుల్‌కల్-మంతూరు 10 కిలోమీటర్లు తారురోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అవి మరింత పెద్దవికావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. గతంలో సింగూరు వద్ద గుంతలో ద్విచక్రవాహనం పడి వ్యక్తి మృతి చెందాడు. ఇటీవల సింగూరు ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడానికి వచ్చిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదరకు రోడ్ల పరిస్థితిని వివరించడంతో తాత్కాలికంగా గుంతలను మట్టితో పూడ్చారు.

తారురోడ్లు మాయం..

తారురోడ్లపై మట్టి, మొరం, పోయడంతో 'తారు రోడ్ల' రూపురేఖలు మారి మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. పుల్‌కల్ మండలానికి చెందిన ప్రజలు పాడైన రోడ్లపై ప్రయాణం చేయలేక సదాశివపేట పట్టణానికి సంగారెడ్డి నుంచి, వట్‌పల్లి మండలానికి జోగిపేట నుంచి వెళ్తున్నారు.

పర్యాటకంపై ప్రభావం...

జిల్లాలో సింగూరు నీటిపారుదల ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి ఉంటుంది. జహీరాబాద్, జోగిపేట, సంగారెడ్డి నుంచి పర్యాటకులు వస్తారు. ప్రాజెక్టుకు సంగారెడ్డి, సదాశివపేట, మునిపల్లి నుంచి రవాణా సౌకర్యం ఉంది. సకాలంలో వర్షాలు కురవడంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టుకు వచ్చే రోడ్లు బాగలేకపోవడంతో పర్యాటకుల తాకిడి తగ్గింది. దీంతో ప్రభుత్వ టూరిజం శాఖ హరిత హోటళ్లు, ప్రైవేటు హోటళ్లు వెలవెలబోతున్నాయి.

మట్టి పోస్తేనే బస్సులు

పాడైన రోడ్లపై మరమ్మతు చేస్తేనే ఆర్టీసీ బస్సులను గ్రామాలకు నడుపుతామని ఆర్టీసీ అధికారులు బస్సులను నిలిపేశారు. దీంతో స్థానికులు గుంతలపై మట్టిని పోసి చదును చేశారు. పోచారం, ముదిమాణిక్యం, మంతూరు, అక్సాన్‌పల్లి, బుసరెడ్డిపల్లి గ్రామాలకు బస్సులను పునరుద్ధరించారు.



మట్టిరోడ్డును తలపిస్తున్న మంతూరు తారురోడ్డు

రోడ్లకు మరమ్మతులు చేయాలి



అందోల్ నియోజకవర్గంలో రోడ్లు గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారయ్యాయి. మరమ్మతులకు నోచుకోక పోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. గుంతలను మట్టితో కాకుండా డాంబర్‌తో మరమ్మతులు చేయాలి. మట్టిపోయడంతో వర్షం కురిసినప్పుడు వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి.

–శ్రీనివాస్‌చారి, మాజీ ఎంపీటీసీ, పుల్‌కల్

సింగూరుకు తగ్గిన పర్యాటకులు



సింగూరు రహదారులు గుంతలు పడటంతో పర్యాటకులు తగ్గారు. ప్రాజెక్టు నిండుకుండలా ఉన్నా పర్యాటకుల సందడి కనిపించడం లేదు. దీంతో హోటళ్లకు గిరాకీలు తగ్గాయి. రోడ్లకు మరమ్మతులు చేయించాలని మంత్రి దామోదరకు విజ్ఞప్తి చేశాం.

–శ్రీనివాస్, మత్స్య సహకార సంఘం, సింగూరు

క్యాన్సర్ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు

- డాక్టర్ శైలజ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శైలజ

జోగిపేట(అందోల్): క్యాన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి అయినప్పటికీ భయపడకుండా వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని డాక్టర్ శైలజ అన్నారు. బుధవారం అందోల్‌లోని పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారం రోజుల పాటు నిర్వహించే వారోత్సవాల్లో ముఖ్యఅతిథిగా ఆమె హాజరై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు శారీరక శ్రమతో పాటు ఆహార నియమాలు పాటించాలని సూచించారు. వ్యాధి వచ్చినప్పుడు భయపడకూడదని, అలాగని నిర్లక్ష్యం కూడా చేయొద్దని సూచించారు. వ్యాధి లక్షణాలు వివరిస్తూ తీసుకునే జాగ్రత్తలను తెలియజేశారు. మహిళల్లో ఎక్కువగా బ్రెస్ట్ క్యాన్సర్, పురుషుల్లో నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ ఎక్కువగా వస్తుంటాయన్నారు. విద్యార్థినులు ఆరోగ్య సమస్యలపై చికిత్స చేసుకోవాలంటే కళాశాల ఐడీ కార్డు తీసుకుని జోగిపేటలోని డీఎస్.రెడ్డి ఆస్పత్రిలో ప్రతి బుధవారం ఉచితంగా వైద్యం పొందవచ్చునని ప్రోగ్రాం చైర్మన్ డాక్టర్ అనంతరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, ప్రోగ్రాం కో చైర్మన్ ఎ.రాంబాబు, జోన్‌చైర్మన్ రామకృష్ణ, క్లబ్ అధ్యక్షుడు అల్లె శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు ఎస్.సురేందర్‌గౌడ్, సభ్యులు, ప్రిన్సిపాల్ వాణి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

జిన్నారం (పటాన్‌చెరు) : గుమ్మడిదల మండలం బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–99 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలని పూర్వ విద్యార్థులను ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు స్వప్న, విష్ణువర్ధన్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు మంగయ్య, తులసీకుమార్, కృష్ణ, నగేష్, వరలక్ష్మి, అరుణ, సునీత పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్ క్రాంతిని సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాంరెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని బుధవారం సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. చెరుకు రైతుల అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె సూచించినట్లు తెలిపారు.

పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశం



సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అసెంబ్లీలో జరిగిన పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ ప్రథమ సమావేశంలో బుధవారం కమిటీ సభ్యులు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు. మంత్రి శ్రీధర్‌బాబు, శాసనసభ స్పీకర్ ప్రసాద్, శాసనమండలి స్పీకర్ సుఖేందర్‌రెడ్డి, కమిటీ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతరావు పాల్గొన్నారు. స్పీకర్లతో పాటు, కమిటీ చైర్మన్‌కు సంజీవరెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సదాశివపేట(సంగారెడ్డి): విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం లభిస్తుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సందర్శించి, సమస్యలను పరిశీలించారు. కళాశాలల నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు, అనంతరం కళాశాల ఆవరణలో ఉమెన్స్ హాస్టల్ సదుపాయం, భవనానికి గ్రిల్ ఏర్పాటు, కాంపౌండ్ నిర్మాణం, తాగునీటి సదుపాయం, బాలికల రెస్ట్ రూమ్ వంటి సమస్యలపై ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. దీంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కళాశాల అల్యూమిని అసోసియేట్ ప్రెసిడెంట్ చింతా గోపాల్, ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, కోశాధికారి జంగం మహేశ్, వైస్ ప్రిన్సిపాల్ సిద్దులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో బంద్ విజయవంతం



ధర్నా చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

నారాయణఖేడ్: హిందువుల ఆలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బుధవారం హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి పిలుపు మేరకు నారాయణఖేడ్‌లో బంద్ నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు పట్టణంలోని దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా మూసి ఉంచారు. ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ దుర్గాభవానిమాత ఆలయం నుంచి పట్టణంలోని రాజీవ్‌చౌక్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి, చౌరస్తాలో ధర్నా చేశారు. దాడులను తీవ్రంగా ఖండిస్తూ సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ బీజేపీ కన్వినర్ రజనీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, భజరంగ్ దళ్, వీహెచ్‌పీల బాధ్యులు దశరథ్, మాణిక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ పుష్పన్‌కుమార్



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ

పటాన్‌చెరు టౌన్: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ పుష్పన్ కుమార్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం నందిగామ పరిధిలోని రిసోనేసస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ కొన్న, అమ్మిన చట్టరీత్యా నేరమని, ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీబాఎల్ సీఐ స్వామి గౌడ్, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సీఐ రామనాయక్, సిబ్బంది రిసోనేసస్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

6 తేదీలోపు ఓటు నమోదు చేసుకోవాలి

- తహసీల్దార్ రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు 6వ తేదీ లోపు అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని సమా వేశం నిర్వహించారు. తహసీల్దార్ రంగారావు మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపాల్ ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్ నాయక్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు

మునిపల్లి(అందోల్): టీచర్ ఎమ్మెల్సీ ఓటరు నమోదులో భాగంగా జిల్లా పరిషత్, ప్రభుత్వ జూనియర్ కళాశాల,మహిళా డిగ్రీ కళాశాలలో ఫారం–19ను ఉపాధ్యాయులకు ఏంఈఓటబీమ్‌సింగ్ అందజేశారు.

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోండి

జోగిపేట(అందోల్): అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని అందోల్ తహసీల్దార్ విష్ణుసాగర్ ఓ ప్రకటనలో కోరారు. 2021 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు ఫారం–18 ద్వారా పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రతిసారి ఓటరు లిస్టును కొత్తగా తయారు చేస్తారని, కావున గతంలో ఓటరుగా నమోదైన వారు కూడా తిరిగి కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు పెట్టుకోవాలని పేర్కొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇర్ఫానీ ఉత్సవాలు



ఉర్సులో ఖవాలీ

సంగారెడ్డి టౌన్ : పట్టణ శివారులోని ఇర్ఫానీ దర్గా ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ప్రతి ఏడాది రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు. సంగారెడ్డిలోని జామియా మసీద్ నుంచి గంధం ఊరేగింపు ప్రారంభమై పట్టణంలోని పురవీధుల మీదుగా దర్గాకు చేరుకుంది. పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించి చాదర్ సమర్పించారు. అనంతరం గంధారాధన నిర్వహించి, ఆల్ ఇండియా ముషాయిరాలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కవులు కవి సమ్మేళనంలో పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కొత్త టీచర్లకు సన్మానం

కల్హేర్(నారాయణఖేడ్): నూతన ఉపాధ్యాయులతో బుధవారం కల్హేర్‌లో పీఆర్టీయూ మండల శాఖ తరపున ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పీఆర్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, ఎంఈఓ శ్రీనివాస్‌లు కొత్తగా వచ్చిన టీచర్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో కల్హేర్ మండల శాఖ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, గౌరవ అధ్యక్షుడు గోవర్ధన్, రాష్ట్ర బాధ్యులు మన్మధకిషోర్ పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు ప్రోత్సాహం

జిన్నారం(పటాన్‌చెరు) : గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుల్లో రాణించాలని రాళ్లకత్వ గ్రామానికి చెందిన సాయిగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని శివానగర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తూ మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.5000 వేలు, రెండో ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.3000 వేల రూపాయలు, మూడో ర్యాంక్ సాధించిన విద్యార్థికి, రూ.2000వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సాయిగౌడ్ మాట్లాడుతూ.. తాను కూడా ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేసి పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, జీఎస్‌కే యువసేన సభ్యులు విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ కార్మికుల సంక్షేమమే లక్ష్యం

జిన్నారం(పటాన్‌చెరు) : బొల్లారం పారిశ్రామికవాడలోని ర్యాంపెక్స్ పరిశ్రమ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాన్ని రాష్ట్ర కార్మిక నాయకులు వరప్రసాద్‌రెడ్డి పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి, కార్మిక శాఖ అధికారి రవీందర్ సమక్షంలో వేతన ఒప్పంద పత్రాలను అందజేశారు. సహకరించిన కార్మిక శాఖ అధికారికి యూనియన్ నాయకులు కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కార్మిక శాఖ అధికారి రవీందర్‌ను వరప్రసాద్ రెడ్డి కార్మికులతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పరిశ్రమ కార్మికులు కాశీ రాజు సంపత్, కొండల్ రెడ్డి ప్రసాద్ జితేందర్ సింగ్ శ్రీనివాసులు, సుంకన్న వెంకటేష్ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ ఏఈఓల తొలగింపు అప్రజాస్వామికం

వట్‌పల్లి(అందోల్): డిజిటల్ క్రాప్ సర్వేకు ఒప్పుకోలేదని ఏఈఓలను తొలగించడం అప్రజాస్వామికమని ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు ఎం.బాలయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పక్క రాష్ట్రాల్లో ఏజెన్సీలు, ఇతర శాఖలతో డిజిటల్ క్రాప్ సర్వే చేపడుతుంటే రాష్ట్రంలో ఏఈఓల నెత్తిన రుద్దడం సరికాదన్నారు. ఇప్పటికే 49 రకాల విధులు నిర్వహిస్తున్న వారిపై అదనపు భారం మోపడం ఎంతవరకు సమంజసమన్నారు. దశల వారీగా చేస్తామని చెబుతున్న పట్టించుకోకుండా వేధించడం అన్యాయమన్నారు.

◆ సర్వేను అడ్డుకున్న రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని డప్పూర్, వడ్డి, మల్గి గ్రామాల శివారులో ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీ ప్రాంతంలో బుధవారం జియాలోజిస్టు అధికారులు పర్యటించారు. జియాలోజిస్టు అధికారులు గౌతమి తదితరులు ఆయా గ్రామాల శివారులో మట్టి నమూనాలు, భూగర్భ జలాలను పరిశీలించేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న ఆయా గ్రామాల రైతులు సర్వేను అడ్డుకున్నారు. తాము జియాలోజిస్టు అధికారులమని సర్వే కోసం వచ్చామని వారు చెప్పారు. మాకు సమాచారం ఇవ్వకుండా ఎందుకు సర్వే చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. దీంతో వారు వెనుదిరిగారు.

◆ న్యాయ సేవలందించాలి

సంగారెడ్డి టౌన్: సీనియర్ సిటిజన్లకు న్యాయపరమైన సేవలు అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని గ్రేస్ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వారికి న్యాయపరమైన సేవలందించాలని , ఆరోగ్యకరమైన భోజనం అందించి వారిపై శ్రద్ధగా చూసుకోవాలన్నారు. ఏదైనా న్యాయ సహాయం కోసం కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

◆ మార్కెట్ ధర చెల్లించండి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని గణేష్‌పూర్‌లో బుధవారం నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి, ఆర్డీఓ రాజు రైతులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో నిమ్జ్ కోసం 566 ఎకరాలు సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 417 ఎకరాలు సేకరించామన్నారు. మిగతా 149 ఎకరాల పట్టా భూమి సేకరించాల్సి ఉందని తెలిపారు. ఎకరాకు రూ.15లక్షల పరిహారం చెల్లించనున్నట్లు చెప్పారు. రైతులు కలుగజేసుకొని బహిరంగ మార్కెట్లో ఎకరం రూ.90లక్షలు పలుకుతుందని, దాని ప్రకారం పరిహారం చెల్లించాలని కోరారు. మీరు చెప్పిన విషయాలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

◆ లైన్‌మెన్‌కు ఎమ్మెల్యే నివాళి

జహీరాబాద్: విద్యుత్‌షాక్‌కు గురై మరణించిన లైన్‌మెన్ ఎం.జి.నవీన్‌కుమార్‌కు బుధవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు నివాళులర్పించారు. మండలంలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ ఝరాసంగం మండలంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం చిల్కేపల్లి గ్రామ శివారులో కాలిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించి ఫ్యూజ్‌లు బిగిస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హుగ్గెల్లికి వెళ్లి నవీన్‌కుమార్ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

◆ మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించింది. పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి టౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో ఏడుగురు వాహనదారులు మద్యం సేవించి పట్టుపడ్డారు. వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జిల్లా జడ్జి ఒక్కొక్కరికి రూ. 2000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: మండలంలోని అనేగుంటలో బుధవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో పీఎంజీఎస్‌వై పథకం కింద రూ. 4.31 కోట్ల నిధులు మంజూరయ్యాయి. జనవరి 22 సంవత్సరంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు పనులకు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ బీటీ పనులు చేపట్టి సీసీ రోడ్డులను చేయలేదు. ఆగిన రోడ్డు పనుల గురించి ఎమ్మెల్యే మాణిక్‌రావు ఇటీవల నిర్వహించిన దిశ మీటింగ్‌లో కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. నెలల గడుస్తున్న రోడ్డు పనులు ఎందుకు పూర్తి చేయడంలేదని ప్రశ్నించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయత్‌రాజ్ ఏఈ నవీన్‌కుమార్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో హన్మన్న, జగదీష్ పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

మునిపల్లి(అందోల్): మునిపల్లికి చెందిన అల్లాపూరం భాగమ్మకు రూ.45 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు నరేందర్‌గౌడ్ అందజేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ్మ సహకారంతో చెక్కు త్వరితగతిన మంజూరయిందని తెలిపారు.